11 నుంచి కబడ్డీ పోటీలు

గడివేముల: మండల పరిధిలోని మంచాలకట్టలో వెలసిన దివ్య బాలయేసు దేవాలయం ప్రాంగణంలో జనవరి 11, 12 తేదీల్లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రెవరెండ్ ఫాదర్ తోట జోసెఫ్ తెలిపారు. 13వ తేదీన దివ్య బాల యేసు పండుగ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. విజేతలకు వరసగా రూ.25 వేలు, రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున అందజేస్తామని రెవరెండ్ ఫాదర్ తోట జోసెఫ్ తెలిపారు.



ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రం కర్నూలు సమిపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించు కునేందుకు భక్తులు క్యూకట్టారు. ఎల్లమ్మకు అభిషేకం, కుంకుమా అర్చన తదితర పూజలు నిర్వహించారు. చీరెలు, వడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునందుకు ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

గడివేముల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం 17వ విడత మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమానికి డీపీఓ అన్వరా బేగం, ఏపీఓ ఎంఈ భాస్కర్ నాయుడు, ఏపీడీ బాలాజీ నాయక్, శిభారాణి హాజరయ్యారు. మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీలలో 2023 మార్చి నుంచి 2024 మార్చి 31 వరకు దాదాపు రూ.9 కోట్లతో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేశారు. 14 గ్రామాలలో ఉపాధి పనుల రికార్డులలో అవకతవకలు జరిగాయని గుర్తించారు. రూ.6,80203 రికవరీ చేయాలని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మన్ సురేంద్ర కుమార్, గంగాధర్, ఎంపీడీఓ వాసుదేవ్ గుప్తా, ఏపీఓ వెంకటరమణ కాంతయ్య, ఉపాది సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధి పనుల రికార్డులు తనిఖీ చేస్తున్న అన్వరా బేగం

ఎస్సార్బీసీ కాలనీలో దొంగతనం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని ఎస్సార్బీసీలో కాలనీలో దొంగతనం జరిగింది. షామియానా షాపులో సుమారు రూ. 30వేల సామగ్రిని దోచుకెళ్లారని యజమాని శంకరయ్య తెలిపారు. తెల్లవారుజామున కిటికీలు పగులగొట్టి సామాగ్రిని ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ప్రజలందరికీ మంచి జరగాలి


మాజీ ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: నూతన సంవత్సరంలో ప్రజలకు అంతా మంచి జరగాలని, ఆరోగ్యంగా ఉంటూ ఆర్థికాభివృద్ధి చెందాలని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్ష్యుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజలకు కాటసాని నూతన శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అనుకున్నవి నెరవేరి మంచి జరగాలని దేవుడిని కోరతున్నానని చెప్పారు. గతేడాది ఎదురైన ఒడిదుడుకులను కొత్త సంవత్సరంలో అధిగమించి లక్ష్యాలు చేరుకోవాలని కోరారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు


కోడుమూరు ఇన్ చార్జ్ ఆదిమూలపు సతీష్

కర్నూలు(రూరల్): కోడుమూరు నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖసంతోషాల తో ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. తాను నూతన జనవరి 1న ప్రజలకు అందుబాటులో ఉండనని, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు గమనించాలని కోరారు. తనను కలిసేందుకు కార్యాలయానికి రావద్దని సూచించారు.

న్యూఇయర్ కేకులకు భలే డిమాండ్


కోడుమూరులో కేకులు కొనుగోలు చేస్తున్న జనం



స్కూల్‌బ్యాగ్‌లు, ప్లేట్లు, మగ్‌లను అక్షరాలుగా పొందుపరిచి కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న హాస్టల్ విద్యార్థులు

కోడుమూరు రూరల్: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని కేకులకు భలే డిమాండ్ ఏర్పడింది. 2025నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేకులను కట్ చేసి సంబరాలు చేసుకునేందుకు యువత ఏర్పాట్లలో మునిగితేలుతున్నారు. మంగళవారం పట్టణంలోని బేకరీలు కిటకిటలాడాయి. కేకులను కొనేందుకు ప్రజలు బారులు తీరారు. పట్టణంలో పది ప్రాంతాల్లో వ్యాపారులు కేకులను అమ్మకానికి పెట్టారు. కిలో కేకు రూ.300 నుంచి రూ.700ల వరకు నిర్ణయించి జోరుగా అమ్మకాలు సాగించారు. వ్యాపారస్తుల మధ్య పోటీ నెలకొనడంతో సాయంత్రానికి కిలో కేకు రూ.260 ప్రకటించారు.

సి బెళగల్: కొత్త సంవత్సర సంబరాలు మంగళవారం నుంచే ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి వేడుకలు సంతోషంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు సాయంత్రమే పూర్తి చేశారు. మండల పరిధిలోని కొండాపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం అచ్చన్న పాఠశాల టీచర్లతో కలిసి ముందస్తుగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. స్థానిక బీసీ వసతి గృహ విద్యార్థులు వినూత్నంగా నూతన సంత్సరానికి స్వాగతం పలికారు. స్కూల్ బ్యాగ్‌లు, ప్లేట్లు, బకెట్లు, మగ్గులను 'హ్యాపీ న్యూ ఇయార్ 2025' అక్షరాలుగా పొందపరిచి స్వాగతం పలికారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కర్నూలు(రూరల్): భూ సమస్యల పరిషారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. కర్నూలు మండలం పంచలింగాలలో మంగళవారం రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఎంపీ హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ భూ సమస్యలపై 20 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ సూధకర్, వీఆర్వోలు మద్దిలేటి, భారతి తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ప్రభుత్వం నిర్వహిస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దుర్వేశి గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును పరిశీలించారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మండ్ల మమత, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ సత్యనారాయణరెడ్డి, ఈఓపీఆర్డీ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో మంగళవారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ భూ సమస్యలపై 11మంది రైతులు వినతులు అందజేశారని తహసీల్దార్ తెలిపారు. ప్రతి వినతికి నిర్ణీత సమయంలో పరిష్కారం చూపుతామని చెప్పారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్‌రెడ్డి, ఆర్ఐ రామ్ సర్పంచ్ యల్లకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకలో మంగళవారం తహసీల్దార్ విద్యాసాగర్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. వినతులను పరిశీలించి 45 రోజుల్లో పరిష్కరిస్తామని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు. కాల్వబుగ్గ ఈఓ మద్దిలేటి, మండల సర్వేయర్ శంకర్‌మాణిక్యం, సర్పంచ్ పెద్ద కాశీం తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

సి.బెళగల్: ప్రాథమిక పరపతి వ్యవసాయ సహకార సంఘంలో (సొసైటీ) ఖాతాదారులుగా ఉన్న రైతులు ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో ఈ కేవైసీని చేయించుకోవాలని ఏఓ మల్లేషకుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన వ్యవసాయ సిబ్బందితో కలిసి మండలంలోని పోలకల్ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ రైతు సేవా కేంద్రంలో రైతులతో ఏఓ సమావేశమయ్యారు. సాగు సంరక్షణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఏఓ రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, రైతులు ఉన్నారు.